# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- భోగాపురం విమానాశ్రయాన్ని 6 నెలలు ముందుగానే పూర్తి చేస్తామని కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరేలా బీమా కార్డులు అందించి ఆరోగ్య భద్రతను కల్పిస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.
- ప్రవాస భారతీయులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.
- తుంగభద్ర డ్యాం గేట్ పునరుద్దరణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేశారు.
- కృష్ణ జిల్లా మచిలీపట్నంలో అక్వా మెరైన్ ఫిషింగ్ వర్సిటీ ఏర్పాటు చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు.

============================

భోగాపురం విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్దేశించిన గడువు కంటే 6 నెలలు ముందుగానే పూర్తి చేస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయ నిర్మాణ పనులను ఈ రోజు ఆయన రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, విజయనగరం ఎం.పి. కలిశెట్టి అప్పల నాయుడులతో కలిసి పరిశీలించారు. ఎయిర్ పోర్టు టెర్మినల్, ఏటిసి టవర్, రన్ వే నిర్మాణాల పనుల పురోగతిపై జి.ఎం.ఆర్. గ్రూప్ సంస్థల అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ఇకపై ప్రతి నెలా ఈ ప్రాజెక్టును సందర్శించి, పనుల పురోగతిపై సమీక్షిస్తానని తెలిపారు. నిర్మాణ పనులు ఇప్పటికే 36.6 శాతం పూర్తి అయ్యాయని, రాష్ట్రంలో మరి కొన్ని విమానాశ్రయాలను ఏర్పాటు చేస్తామని తెలియజేస్తూ...

(వాయిస్ 42 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరేలా బీమా కార్డులు అందించి ఆరోగ్య భద్రతను కల్పిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భరోసా అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఆదివరపు పేట గ్రామంలో చేనేత సంఘ కార్మికులు ఈ రోజు ఏర్పాటు చేసిన క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన చేనేత పరికరాలను అర్హులైన లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఆదివారపుపేట గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా కృషి చేస్తానన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి లభించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రవాస భారతీయులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యునికేషన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గుంటూరులో ఓ సాఫ్ట్వేర్ కంపెనీని ఈ రోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు ఆంధ్రప్రదేశ్ కు రావాలని, రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకొని, ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. అమెరికా వెళ్తున్న విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం లేక తాత్కాలిక ఉద్యోగాలు చేస్తూ... ఇబ్బందులు పడుతున్న వారికి ప్రవాస భారతీయులు మద్దతుగా నిలవాలని కేంద్ర సహాయ మంత్రి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయిన సంఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సమీక్షించారని, ఆయన ఆదేశాలతో సెంట్రల్ డిజైన్ కమిషనర్ తో పాటు ఇంజనీరింగ్ డిజైన్స్ బృందాన్ని తుంగబద్ర ప్రాజెక్టు వద్దకు పంపడం జరిగిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తుంగభద్ర డ్యాం గేట్ పునరుద్దరణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తుంగభద్ర డ్యాం గేటు దెబ్బతిన్న నేపథ్యంలో నదీ పరీవాహక మండలాల ప్రజలను నది వైపు వెళ్లకుండా దండోరా ద్వారా అప్రమత్తం చేశామని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా తెలిపారు. సంబంధిత మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ, నీటిసరఫరా విభాగాల సిబ్బంది ఈ పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని, ప్రజలు భయాందోళనలకు గురి కావొద్దని కలెక్టర్ కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆక్వా మెరైన్ ఫిషింగ్ వర్సిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యావరణ మత్స్యశాఖ అధికారులను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. కృష్ణాజిల్లా గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ పనులను కేంద్ర బృందం ఈరోజు పరిశీలించింది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర పలు సమస్యలను కేంద్ర బృందం దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... మడ అడవుల పెంపకానికి సహకరించాలని కేంద్ర బృందాన్ని కోరినట్లు తెలిపారు. అలాగే సముద్ర తీరం వెంబడి జాతీయ రహదారి నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజల్లో దేశభక్తిని మరింత పెంపొందించేలా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం నిర్వహించాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. ఈరోజు తిరుపతిలో ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగుర వేయాలని కోరారు. "హర్ ఘర్ తిరంగా" పేరుతో ఈనెల 13వ తేదీ నుంచి తిరుపతి జిల్లా వ్యాప్తంగా "హర్ ఘర్ తిరంగా" ర్యాలీలు, ప్రతి ఇంటికి జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

==============================

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా ఆనం రామనారాయణ రెడ్డి ఈ రోజు భాధ్యతలు స్వీకరించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బాధ్యతల చేపట్టిన అనంతరం 113 కోట్ల రూపాయల సి.జి.ఎఫ్. నిధులతో రాష్ట్రంలోని 160 దేవాలయాల ఆధునీకరణ పనుల దస్త్రాలపై ఆయన మొదటి సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కృష్ణా, గోదావరి సంగమం దగ్గర జలహారతులు పునరుద్ధరిస్తామని తెలిపారు. దేవాదాయ శాఖ పరిధిలో 50 వేల రూపాయల లోపు ఆదాయం ఉన్న ఆలయాలకు నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఇస్తున్న 5 వేల రూపాయలను 10 వేల రూపాయలకు పెంచితూ చేసిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపడం జరిగిందని, త్వరలోనే జి.ఓ. జారీ చేస్తామని మంత్రి వెల్లడిచారు.

==============================

చిత్తూరు జిల్లా కలెక్టరేట్ లో రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా నియోజక వర్గ,మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులందరూ విధిగా హాజరుకావాలని సూచించారు.

==============================

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు తృటిలో ప్రమాదం తప్పింది. విజయవాడ నుండి పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం అలంపురం వెళ్తుండగా ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం వద్ద ఈరోజు ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో హోమ్ మంత్రి ఎస్కార్ట్ వాహన డ్రైవరు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఎస్కార్ట్ వాహనం వెనుక ప్రయాణిస్తున్న మంత్రి కారు వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బ తిన్నాయి. ఈ ఘటనలో మంత్రితో సహా కారులోని ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు.

==============================
==============================